పోలికలు

నిజం చెపుతున్నా,

మా శంకరయ్య తాతకు చిన్నచిన్నవి కూడా తెలియదు. "అదేంది? ఇదేంది?" అని నన్నే అడుగుతాడు. మా తాతయ్యకే నాన్న, ఈ శంకరయ్య తాత. అంత పెద్ద తాతయ్య 'ఏదడిగినా నాకు బలే బాగుంటుంది. నాకెన్నో తెలుసు. చెపుతాను. చెబితే ఏంలే, పిల్లలకు తెలియకపోతే పెద్ద వాళ్లనడిగి తెలుసుకోవాలంటారు. మరి, పెద్దవాళ్లకు తెలియకపోతే, పిల్లల్ని అడగటంతప్పా? అడిగి తెలుసుకుంటే తప్పేముంది? పెద్దవాళ్లకు కూడా తెలియనివి ఎన్నో ఉంటాయి. శంకరయ్య తాతను వచ్చినప్పటినుంచి చూస్తున్నాగా...

శంకరయ్యతాత బలేగుంటాడు - సన్నగా, ఎత్తుగా, కొంచెం తెల్లగా. పంచె కట్టుకుంటాడు. జుబ్బా వేసుకుంటాడు. భుజం మీద టవల్ వేస్తాడు. బలేవాడులే. 'పాపోడా!' అని నన్ను ముద్దుగా పిలుస్తాడు. అమ్మను 'పాపా!' అని పిలుస్తాడు. అమ్మమ్మను 'గంగమ్మా!' అని పిలుస్తాడు. తాతయ్యను ఎట్లా పిలిచేదీ నేను వినలేదు. నన్ను పిలిచేదే ఎక్కువ. నాతో మాట్లాడేదే ఎక్కువ. నన్ను 'ప్యార్' చేసేదే ఎక్కువ. నన్ను అడిగేదే ఎక్కువ. సెలవులకు వచ్చాగదా! శంకరయ్యతాత లేకుంటే ఎంత బోరుగా ఉండేదో?

సెలవుల్లో అయితే నేను ఆలస్యంగా నిద్రలేస్తా. ఎవరూ ఏమీ అనరు. నిద్ర లేచానా, బాత్రూముకు వెళ్లానా, బ్రష్ చేసుకున్నానా, హాల్లోకి వచ్చానా, అన్నీ చకచకా. శంకరయ్య తాత కనబడలేదు. నేను తోడులేకుండా బయటికి పోదే. తాతయ్య అయితే బయటికిపోతాడు. పోలీస్ డిపార్ట్‌మెంట్ గదా! ఎప్పుడు పోతాడో,

ఎప్పుడొస్తాడో? నేను చూసి నాలుగు రోజులైంది. మరి శంకరయ్యతాతకు ఏం పని ఉంది? ఏ పనీలేదుగా - నాకులాగే. ఇద్దరికీ సెలవులే. డాక్టరుకు చూపిస్తాను రమ్మని తాతయ్య గట్టిగా పిలిచాడట! బలవంతంగా వెంటబెట్టుకొని వస్తే వచ్చాడట! ఈ శంకరయ్య తాత ఇంతకూ ఎక్కడకు పోయినట్లు? అమ్మనడిగితే తెలుస్తుంది.

అమ్మ బూస్ట్ తెచ్చింది. బూస్ట్ ఈజ్ సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ. నాప్‌కిన్‌తో మూతి తుడుచుకున్నాక అమ్మనడిగా, "శంకరయ్యతాత ఎక్కడ మమ్మీ" అని.

"పెదతాతయ్య అని అన్లేవా?" అమ్మ కొంచెం కోప్పడింది. అమ్మలకు కోపం ఉంటుంది.

"పప్పాతో" మాట్లాడేటప్పుడు 'మా పాతపల్లె తాత'... 'మా శంకరయ్యతాత' అని అంటావు గదా మమ్మీ?" అన్నా.

"ఎదుటివాళ్లకు చెప్పేటప్పుడు అట్లా అంటారు", అంది మా అమ్మ.

నేనేం తక్కువ తినలేదు. నాకూ తెలుసు. మా పప్పా నాకెన్నో చెపుతాడు, మమ్మీ చెప్పేవిగాక. టీచర్లు చెపుతారు. దోస్తులు చెపుతారు. నాకూ తెలుసు.

"నేనిప్పుడు నీతో మాట్లడుతున్నా. అందుకే శంకరయ్యతాత అన్నా. పిలిచేటప్పుడు 'పెత్తాతయ్యా' అనే పిలుస్తున్నాలే," అన్నా.

"అన్నీ మీ నాన్న బుద్ధులే. సరేలే. కింద ఉంటాడు. పిల్చుకొని రా. ఇద్దరూ కలిసి టిఫిన్ తిందురు", అంది అమ్మ.

మెట్లు దిగి కిందికి వెళ్లా. వాచ్‌మన్ రూం ముందు మంచంలో కూచొని శంకరయ్యతాత బీడీ కాలుస్తున్నాడు. బీడీలు కంపే. శంకరయ్యతాత కాలుస్తుంటే సరదాగా ఉంటుంది. చేతివేళ్లని పైకెత్తి కుక్కమూతి లాగా పెట్టి, గోడలమీద కుక్క బొమ్మ నీడపడేట్లు చేస్తామే - ఎడమ చెయ్యి వేళ్లను అట్లా పెట్టి కాలుస్తాడు. దగ్గరికి వెళ్లి "తాతయ్యలాగా గోల్డ్‌ఫ్లేక్ పెద్ద సిగరెట్లు కాల్చకూడదా, పెత్తాతయ్యా?" అన్నా.

"ఇదే ఖర్చు దండగ పాపోడా. అలవాటయి చచ్చింది", అన్నాడు.

"స్టయిల్ గదా!" అన్నా.

"అంటే?" నా తాతయ్య నా గడ్డం పట్టుకొని అడిగాడు.

"అది ఇంగ్లీషులే" అన్నా.

శంకరయ్యతాతకు నాకొచ్చినట్లు ఇంగ్లిష్ రాదు, పాపం! ఇంగ్లిష్ అని కూడా అనలేదు. ఇంగిలీసు అంటాడు. నాకు తెలుసు. నాకు హిందీ, మరాఠీ కూడావచ్చు. శంకరయ్యతాతకు తెలుగే తెలుసు. శంకరయ్యతాత బీడీని నేల మీద రాసి ఆర్పివేశాడు. ఒక మూలకు విసిరేశాడు.

"పాప పిలుస్తోంది", అన్నా.

"మీ అమ్మ నాకు పాప. నీకు కాదు పాపోడా", నా జుట్టు నిమురుతూ అన్నాడు. బలే నిమురుతాడు.

'జోక్‌లే' అందామనుకున్నా. శంకరయ్య తాతకు జోకులు వెయ్యడం తెలుసు. జోక్ అనే ఇంగ్లిష్ మాటకు అర్థం తెలియదుగా. చెయ్యి పట్టుకున్నా. మా ఫ్లాట్‌లోకి వచ్చాం. డైనింగ్ టేబుల్ మీద అమ్మ బ్రేక్‌ఫాస్ట్ సర్దుతోంది. శంకరయ్యతాత సోఫాలో కూర్చున్నాడు. నేనూ పక్కన కూర్చున్నా. "టి.వి. పెట్టుకొని, చూస్తూ టిఫిన్ తిందాం పెత్తాతయ్యా" అన్నా.

"పెట్టడం నీకొచ్చునా?", అన్నాడు.

నాకు వి.సి.ఆర్. పెట్టడం కూడా వచ్చు. రిమోట్ తీసుకున్నా. ఛానల్ నొక్కా స్టయిల్‌గా ఒంగి, శంకరయ్య తాతవైపు చూస్తూ ఫోజు పెట్టాలే. కార్టూన్ ఫిల్మ్ టైం. అదే ఛానల్ నొక్కా. నాకు కార్టూన్ ఫిల్ములంటే ప్రాణం.

"తోలు బొమ్మలాటల్లో మాదిరిగానే ఉండాయే ఈ బొమ్మలూ, మాటలూ పాపోడా!" శంకరయ్యతాత మాటలు బలేగా ఉంటాయి.

"అట్లాంటిదేలే తాతయ్యా! బొమ్మలు వేసే వాళ్ళు రకరకాల కదలికల్తో ముందు బొమ్మలు వేస్తారు. ఆ బొమ్మల్ని కదిలేటట్లు సినిమా తీస్తారు", అంది అమ్మ.

"మనూళ్లో పిచ్చయ్య తోలుబొమ్మల్ని తయారుచేసేవాడులే. అట్లాగేమోలే." అన్నాడు.

శంకరయ్యతాత కార్టూన్ ఫిల్మ్ చూడటం ఇదే మొదటిసారట! నేను ఎన్నిసార్లు చూశానో!

"ఇదేదో ఇంగిలీసు గొడవ పాపోడా. కథ చెప్పు" శంకరయ్యతాత అడిగాడు.

నేను టూకీగా చెప్పా. తను చూస్తున్నాడు. వింటున్నాడు. నేను మళ్ళీ చూడాలిగా. శంకరయ్యతాత నాలాగా ఎంజాయ్ చేస్తున్నాడు. డైనింగ్ టేబుల్ వద్దకు రమ్మని పిలవకుండా, టిఫిన్ తెచ్చి మాచేతుల్లో పెట్టింది మమ్మీ. శంకరయ్యతాత ఉన్నాడుగా. నాకెందుకు భయం? డైనింగ్ టేబుల్ దగ్గరే తినాల్సిన పనిలేదు.

"ఎప్పుడూ మాటలూ, టి.వి., ఆటలూ. సెలవులకు ఇక్కడికి వస్తామా. ఇదీ నీ మనుమడి పని తాతయ్యా", మమ్మీ నామీద చెప్పింది. "పసిపిల్లోడు గద పాపా!" శంకరయ్యతాత సపోర్టు చేశాడు.

"నాకు పదేళ్లు", అన్నా శంకరయ్యతాత వైపు తిరిగి.

" మరి చదువేం కావాల? బొంబాయికి తిరిగి పోతాం గదా. స్కూలు తెరిచేటప్పటికి. కూర్చోబెట్టి చదివించి, చదివించి అవస్థలు పడాలి- మరచిపోయినవాటిని" అమ్మ అంది.

"పాపోడు తెలివిమంతుడు పాపా! మీ పెదనాయన పిల్లలమాదిరి కాదు. అక్కడున్న వాల్లకు ఒక్కడంటే ఒక్కడికి చదువబ్బలేదు. వాల్లకంటే గొర్లు నయం పాపా!"

"గొర్లు అంటే ఏంది మమ్మీ?"

"షీప్" అని మమ్మీ చెప్పింది. అమ్మమ్మ పిలిస్తే మాస్టర్ బెడ్‌రూంలోకి వెళ్లింది.

"షెఫర్డ్‌బాయ్ అండ్ ద టైగర్ కథ నీకు తెలుసా పెత్తాతయ్యా?" అని శంకరయ్యతాతను అడగబోయా. ఇంగ్లిష్ మాటలు మాట్లాడితే శంకరయ్యతాత బలే ఇదిగా నవ్వుతాడు.

సాయంత్రం శంకరయ్యతాతను పార్కుకు తీసుకవెళ్లా.

"ఏందిది? వనమా? కాదే పాపోడా?" చుట్టూ చూస్తూ శంకరయ్యతాత అడిగాడు.

"పార్క్" అన్నా.

"గాలి బాగుందనుకో. ఈ గడ్డీ గాదానికీ, మొక్కలకూ, చెట్లకూ ఇంత భూమి ఎందుకు పాపోడా? పశువుల్ని మేపనిస్తారా, పాడా? ఒక అయిదెకరాలుంటుందేమో. నీళ్ల పారకం ఉంటే మంచి తోటకట్టు. తోటలాగే ఉందనుకో. మల్లె పొదల్లాగా ఉండే చెట్లను చుట్టూగా రెండు వరసలు నాటినారు - నడుమ దారి విడిచి, రెండో ఫరస బయట పాదులు తవ్వి ఏమిటేమిటో మొక్కలు నాటినారు. గోడలచారంతా చెట్లు - సుంకేసలచెట్లు, అవేవో నేరేడు చెట్లు మాదిరిగా ఉండేవి. ఒక్క వేప చెట్టులేదు. మర్రిచెట్టు లేదు. రావిచెట్టు లేదు. ఇది ఎవరిది? గ్రామనెత్తం ఏమోలే! ఇంతకూ ఇది దేనికి పాపోడా?"

శంకరయ్యతాత మాటలకు బలేగా నవ్వొచ్చింది. పెద్దవాళ్లను ఎగతాళి చెయ్యకూడదు. నవ్వును బిగబట్టుకున్నా.

"ఈ పార్కు జాగింగుకూ, వాకింగుకూ పెత్తాతయ్యా. పిల్లలు ఆడుకోవచ్చు" అన్నా.

"జాగింగు, వాకింగు అంటే పాపోడా?"

శంకరయ్యతాతకు అర్థమయ్యేట్లు చెప్పాలంటే కష్టంగదా.

అదుగో ఆ నల్లపాంటు, తెల్ల టీషర్టు అంటే చొక్కా వేసుకున్నాడే అయన, తొందరతొందరగా నడుస్తున్నాడు చూడు పెత్తాతయ్యా. అట్లా నడవడం జాగింగ్, అదిగో, ఇంకొకాయన చేతిలో స్టిక్ అంటే కర్ర ఊపుకుంటూ నడుస్తున్నాడు. అది వాకింగ్", అమ్మయ్య! చెప్పేశాను.

"మనూర్లో పొలాలకు పొయ్యే రయితులంతా, కూలోల్లంతా చేసేది ఇదేలే. పల్లెటూర్లలో పనికోసం నడుస్తారు. పట్నాల్లో పొద్దుపోక నడుస్తారు, బూడ్సుల్తో. అంతేనా పాపోడా?"

శంకరయ్యతాత కష్టమైన ప్రశ్నలు వేస్తాడు.

ఒక మూలగా చెట్టుకింద కూర్చున్నాం. పార్కంతా కన్పిస్తోంది. మాకంత దూరంలో ఒకాయన కూర్చొని ఉన్నాడు. ముక్కును ఒక పక్క ఒకసారీ, మరొకపక్క ఒకసారీ చూపుడు వేలితో మూసుకుంటూ గాలిని పీలుస్తున్నాడు. శంకరయ్యతాత ఆయన్ని చూసి "పాపోడా!" అని పిలిచాడు. శంకరయ్యతాత ముఖంలోకి చూశాను.

"ఆ పెద్దమనిషి ఏం చేస్తండాడంటావు? మన ఊర్లో ఒక మఠం ఉందిలే. ఆ మఠంలో సాధుపక్కీరయ్య అని ఉణ్ణాడులే. ఆ సాధుచేసినట్లు చేస్తండాడు. ఈ మనిషి సన్నాసో, సాధో అయితే, కాషాయబట్టలు కట్టుకోలేదే?"

"మంచి గాలి పీలుస్తున్నాడు పెత్తాతయ్యా, గుండెలకు మంచిదని..." అని చెప్పా.

"సరేగానీ పాపోడా! అదుగదుగో ఆ చెట్టును బట్టుకొని... కూర్చుంటా ఉండాడు. లేస్తా ఉండాడు. మర్లా కూర్చుంటా, లేస్తా. ఇవి పట్నంలోని పిల్లాటలా?"

"అది ఒక ఎక్సర్‌సైజ్" అన్నా.

"ఏందో తలాతోకాలేని యవ్వారం... ఇట్లాటోళ్లను మనూర్లో కట్టేపేళ్లను చీల్చమనాల. సరేగానీ, మీ తాతకూడా ఇట్లా నడుస్తాడా?"

"ఆఁ ప్రతిరోజూ అందరికన్న ముందు లేస్తాడు. ఈ పార్క్‌లోనే వాకింగ్ చేస్తాడు", అని బదులు చెప్పా.

"ఎందుకంట? రోజూ రాత్రిళ్లు తాగేది దిగిపోడానికా?"

శంకరయ్యతాత కెందుకొచ్చిందో అంత కోపం?

షుగర్ ఉంది తాతయ్యకు, పెత్తాతయ్యా. రోజుకు ఇరవైరౌండ్లు నడుస్తాడట, తాతయ్య. అమ్మతో చెపుతూవుంటే విన్నాలే", అని సర్ది చెప్పా.

"సుగర్ అంటే అదేంది పాపోడా?"

"అదో జబ్బు పెత్తాతయ్యా. చెక్కర లేకుండా కాఫీ తాగాలి. లడ్లూ అవీ తినకూడదు..."

"అయ్యో! అదేం పాడుజబ్బు పాపోడా? పాపం! వీడికొచ్చింది. బెల్లం బువ్వ, బెల్లం పరమాన్నం, ఓళిగలు, అప్పచ్చులు, కజ్జికాయలు, నూగుంటలు ఎంత ఇష్టమో మీ తాతయ్యకు, పిల్లప్పటినుంచీ!. అవన్నీ తినకూడదా? మద్దెలో ఈ రౌండ్లు తిరగడమేంది?"

తాతయ్య అంటే పెత్తాతయ్యకు ప్రేమే.

"డాక్టర్లు చెప్పారు", అన్నా.

"ఏం డాకటేర్లో, ఏం పాడో! నాకేం రోగంలేదు కుయ్యోమొర్రో అని మొత్తుకున్నా. చిక్కిపోయినానంట! ఈ అయిద్రాబాదు తీసుకొని వచ్చినాడా? ఇంకా పోలేదనుకో. పోతే పని పంగాలేని ఏది చెయ్యమంటారో - డబ్బు గుంజి", శంకరయ్యతాత దిగులుచూసి నాకూ దిగులైంది.

రెండుగేట్లలో నుంచీ దీదీలు, అంటీలు, అమ్మమ్మలూ వచ్చారు. వాకింగ్ మొదలుపెట్టారు. శంకరయ్యతాత వాళ్లందరినీ ఎగాదిగా చూస్తున్నాడు. అట్లా ఎగాదిగా చూడటం మానర్స్ కాదు. టీచరు చెప్పింది. ముక్కూ ముఖం తెలియని స్త్రీలను ఎగాదిగా చూడకూడదు. శంకరయ్యతాత మరీ ఓల్డ్‌మాన్ గదా! ఎవరూ ఏమనుకోరులెమ్మనుకున్నా. శంకరయ్యతాత అడిగాడు.

“ఇదేంది పాపోడా! ఇక్కడ తిరుగుతూ ఉండే ఆడోళ్లకు కూడా రోగాలున్నాయా? ఇళ్లల్లో పనీపాటల్లేవా?”

“ఆరోగ్యానికి వాకింగ్ మంచిది తాతయ్యా. ఆడామగా తేడాల్లేవు”, అన్నా.

“పొలం పనులకంటేనా? ఇంటి పనులకంటేనా? అయినా ఇక్కడ పొలం పనుల్లేవు. ఇంట్లో పనులూ తక్కువే... బొంబాయి సంగతులు చెప్పు పాపోడా”, శంకరయ్యతాత బొంబాయి అనే వేళకు నాకు హుషారొచ్చింది.

బొంబాయి ముందు హైదరాబాద్ పనికిరాదని చెప్పాను. జుహుబీచ్‌లో ఒంటెలు ఎక్కడం, సముద్రం ఒడ్డున ఇసకలో పరుగెత్తడం, ఐసుక్రీములు తినడం, డింపుల్ కపాడియా ఇల్లు, జితేంద్ర ఇల్లు, మా విలేపార్లే ఇర్లాలేన్‌లోని సన్యాసి ఆశ్రమం, నూడుల్స్, పిజాలు, కోకోకోలాలు, గణపతిపప్పా, పార్కులు, గేట్ వే ఆఫ్ ఇండియా, అక్కడ పావురాలు, ఎలిఫెంటాకేవ్స్, పెద్ద పెద్ద హోటళ్లు, మల్టీస్టోరీడ్ బిల్డింగులు, షారూఖాన్... చాలా చాలా చెప్పాలే. బొంబాయికి రమ్మని కూడా చెప్పాను. అంతా విని శంకరయ్యతాత అన్నాడు:

“మీ బొంబాయి ముందూ, ఈ హైదరాబాదు ముందూ మనూరు పాతపల్లె ఇంత ఉంటాదంటావా?”, గోలీ అంత మట్టిపెళ్లను చేతిలో తీసుకొని “ఇంత?” అని నాకు చూపించాడు.

శంకరయ్యతాత మాటిమాటికీ వాళ్ల ఊరితో పోల్చి చూస్తాడు. అదేదీ శంకరయ్యతాత వాళ్ల ఊరు? పాతపల్లె... ఓల్డ్ స్మాల్ విలేజ్. నేను చూల్లేదు ఇంతవరకు. గోలీ అంతే ఉంటుందిలే.

చీకటి పడింది.

“ఇంటికి పోదాం, పెత్తాతయ్యా, అమ్మ కోప్పడుతుంది”, అన్నా.

నాకు చీకటంటే చాలా భయం. పార్కులో లైట్లను ఎవరో పగలగొట్టారు.

ఇంటికి వెళ్లేసరికి, సోఫాలో కూర్చొని అమ్మా, అమ్మమ్మా మాటల్లో ఉన్నారు. శంకరయ్యతాత, నేనూ బాత్‌రూంలోకి వెళ్లి కాళ్లు కడుకున్నాం. సోఫాల్లో కూర్చున్నాం.

అమ్మ చెప్పింది:

“తాతయ్యా! నాన్న ఫోను చేశాడు. రేపు పొద్దున్నే డాక్టరు దగ్గరకు పోవాలట. మనిద్దరం కలిసి పోవాలి. అక్కడ అన్నీ నాన్న మాట్లాడి పెట్టాడులే. ఏర్పాట్లన్నీ చేశాడు.”

“నాకేం రోగాలున్నాయి పాపా! మీ నాయన ఇదిగానీ”, శంకరయ్యతాత గొణిగాడు.

“నేనూ వస్తా మమ్మీ మీతో”, అన్నా. నేను గొడవచేస్తానని అమ్మకు తెలుసు.

“సరేలే. కారొస్తుంది వెళ్దాంలే”, అంది.

మరుసటి రోజున శంకరయ్యతాతకు ఎన్ని టెస్టులో! టెస్టులమీద టెస్టులు. శంకరయ్యతాత టెస్టులకు వెళ్లడం, మమ్మీ అక్కడికీ ఇక్కడికీ పరుగెత్తడం. నేనేమో కదలకుండా ఒకచోట కూర్చోవాలి - రిసెప్షన్‌లో ఎవరితో మాట్లాడాలి. చదువుదామంటే అన్నీ పెద్దవాళ్ల మ్యాగజైన్లే. రిసెప్షన్ హాళ్లలో పిల్లలకు మ్యాగజైన్లు అవసరం అనే తెలివిలేదు. బోర్ కొట్టింది. ఇంకా రెండు రోజులు టెస్టులు చెయ్యాలన్నారట. ఆ రెండు రోజులూ నేను వెళ్లలేదు. ఇంట్లోనే ఉన్నా. అమ్మమ్మ ఎక్కువ మాట్లాడదు. నేనేమో టి.వి., కంప్యూటర్‌గేమ్స్‌లో. ఫ్లాట్స్‌లో నా ఈడు పిల్లలు లేరు. శంకరయ్యతాతలాంటి ఫ్రెండు ఒక్కరూలేరు.

శంకరయ్యతాత సాయంత్రానికి వచ్చినా, దిగులుగా ఉంటాడు. ఎక్కువగా మాట్లాడడు. అమ్మను అమ్మమ్మ ఏదో అడుగుతుంది. అమ్మ ఏదో చెపుతుంది. తాతయ్య నన్ను అడగడు. రోగాలమీద కోపం వచ్చింది. మూడురోజులు టెస్టులే టెస్టులు.

నాలుగోరోజు తాతయ్య ఇంట్లో ఉన్నాడు.

"నాకేం జబ్బుందిరా, డాక్టర్లు ఇట్లా చంపినారు?" అన్నాడు శంకరయ్యతాత.

"అదీ నీకు తెలుసా? నాకు తెలుసా? వైద్య పరీక్షల్లో తేలాల. డాక్టర్లు చెప్పాల", అన్నాడు తాతయ్య.

"మన ఊరినంతా - ఇల్లూ, భూములూ, గొడ్డూగోదా-తెగనమ్మితే కూడా ఇట్లాటి ఆస్పత్రిని కట్టడం కుదరదనుకో. మంచి సోకుల ఆస్పత్రిలోనే చూపించినావు. అడిగి అడిగి, పరీచ్చలు చేసి చేసి చంపినార్రా", శంకరయ్యతాత నావైపు చూస్తూ అన్నాడు.

"ఇప్పటికి నీకేం లేదని చెప్పినారు గానీ, కాస్తా తిండీ అదీ బాగా తినాల", అన్నాడు తాతయ్య, అమ్మమ్మవైపు చూస్తూ.

"ఎంత గుంజినారు?" అని అడిగాడు శంకరయ్యతాత, నావైపు చూస్తూ.

"నీకెందు కా తంటా? కొడుకునైనందుకు ఆ మాత్రం పెట్టుకోలేనా?" అన్నాడు తాతయ్య, అమ్మమ్మవైపు చూస్తూ.

"ఇంకా పెళ్లిగాని ఇద్దరు కూతుర్లున్నారు. బయట ఊర్లల్లో చదువుకుంటున్నారు", అన్నాడు శంకరయ్యతాత అమ్మవైపు చూస్తూ.

"అదంతా నీకెందుకుగానీ... బాగా తిను. బాగా పడుకో. ఒక పది రోజులపాటూ. పని ఉంది..." అని తాతయ్య బయటికి వెళ్లిపోయాడు.

శంకరయ్యతాతకు అమ్మ, అమ్మమ్మ ప్రతిరోజూ బలవంతంచేసి తినిపిస్తున్నారు. కాఫీ తాగనివ్వడంలేదు. గుడ్లు, మటనో, చికెనో, ఫిష్షో, ప్రాన్సో పూటపూటా... నన్ను బలవంతంచేసి తినిపించటంలా, అట్లా... నాలాగే శంకరయ్యతాత సరిగా తిననే తినడు. నాకంటే నూడుల్స్ ఇష్టం. లేకపోతే తినను. తాతయ్యకు ఏ ఇష్టమూలేనట్లుంది.

ఆ సాయంత్రం పార్కులో చెప్పా, "బాగా తినాల పెత్తాతయ్యా" అని.

"తినబుద్ధిగాదు పాపోడా" అన్నాడు.

"ఎందుకు?" అని అడిగా.

"అంతంత ఖర్చా?" అన్నాడు.

"అయితే ఏం?" అన్నా.

"మన ఊరు గ్నాపకం వస్తోంది", అన్నాడు.

"వస్తే ఏం?" అన్నా.

"అది నీకు తెల్దులే" అన్నాడు.

"నాకన్నీ తెలుసు" అన్నా.

"నీకేం తెలుసు?" అన్నాడు.

"నువ్వు ఏదోఒకటి అడుగు తెలుస్తుంది", అన్నా ఉపాయంగా.

"గట్టిగా అడిగితే పాప చెప్పిందిలే. రోగం లేదని చెప్పడానికి పదివేల ఖర్చా? మనూర్లో పండితేగిండితే అయిదెకరాల్లోని సెనక్కాయ పంటకు సమానం - అదీ ఇంటి ‚ మనుషులంతా పనిచేస్తే - కూలి ఖర్చులు గాక. ఫలసాయం ఇంటికొచ్చిందాకా నమ్మకంలేదు. ఈ రోజు ఊరి దగ్గరనుంచీ జాబు వచ్చిందా? మీ మామ రాసినాడు. మన తోటలో సెనక్కాయకు లద్దెపురుగు పట్టుకుందంట. బెల్లం పానకం, తవుడూ దూనెట్టు కలిపి మొక్క మొక్కకూ పూస్తుండారంట. రోజూ గండమే. వెంటనే రమ్మని రాసినాడు, మీ మామ. మన పల్లెలట్లా ఉండాయి. ఇంతంత ఖర్చుబెట్టే అన్నం సయిస్తుందా పాపోడా? ఇక్కడంతా వేలూ, లచ్చలూ, కోట్లూ. పట్నాలిట్లా ఉండాయి. డబ్బు పెంచిక బిల్లల్తో సమానం. ఇదంతా ఏమిటి పాపోడా?", శంకరయ్యతాత ఆకాశంవైపు చూస్తూ అడిగాడు.

నిజ్జంగా చెపుతున్నా.

ఇంత పెద్దపెద్దవి తెలిస్తే, శంకరయ్యతాతకు చెప్పేవాణ్ణి.

● ఈనాడు ఆదివారం, 27 సెప్టెంబరు 1998. ●